# పోలింగ్ 84.83%

- జిల్లాలో నమోదైన పోలింగ్ శాతం ఇది..
- మహబూబాబాద్ నియోజకవర్గంలో 82.34శాతం, డోర్నకల్ నియోజకవర్గంలో 87.73శాతం
- పోలీస్ పహారా నడుమ స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఈవీఎంలు
- రేపు ఎన్నికల కౌంటింగ్
- సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్లో ఏర్పాట్లు



కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్న తెలంగాణ గురుకుల పాఠశాల ఇదే..

మహబూబాబాద్, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. 84.83శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాలో మహబూబాబాద్, డోర్నకల్ రెండు నియోజకవర్గాల పరిధిలో తుది పోలింగ్ శాతాన్ని జిల్లా ఎన్నికల అధికారి శశాంక ప్రకటించారు. డోర్నకల్ నియోజకవర్గంలో మొత్తం 219,264 మంది ఓటర్లు ఉండగా, 1,92,365 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 87.73శాతం పోలింగ్ నమోదైంది. మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 2,53,342 మంది ఓటర్లు ఉండగా, 2,08,598 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ 82.34 శాతం ఓటింగ్ నమోదైంది. కాగా, గురువారం ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే అధికారులు మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల ఈవీఎంలను జిల్లాకేంద్రంలో తెలంగాణ గురుకుల పాఠశాలకు పోలీస్ బందోబస్తు నడుమ తరలించారు. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి పోలీస్ పహారాను ఏర్పాటు చేశారు. ఈ నెల 3న ఆదివారం నిర్వహించే కౌంటింగ్‌కు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి శశాంక పరిశీలించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు.

### పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

*జిల్లా ఎన్నికల అధికారి శశాంక*

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలో అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు. 3న ఆదివారం ఉదయం 8 గంటలకు చేపట్టే కౌంటింగ్ ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు సూచనలు చేశారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానున్నందున పాత్రికేయులు త్వరగా చేరుకోవాలన్నారు. ముందుగా కౌంటింగ్ ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా మ్యాపు రూపంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎక్కడికక్కడ బారికేడ్లను పెట్టాలన్నారు. కౌంటింగ్ కేంద్రం ఆవరణలోనికి ఇతరులకు అనుమతి ఇవ్వొద్దని సూచించారు. కౌంటింగ్ కేంద్రంలో పని చేసే సిబ్బందికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, లైటింగ్ ఎక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్ల ఈ నెల 2వ తేదీ ఉదయం 10 గంటలకు ఐడీవోసీలోని కలెక్టర్ కాన్ఫరెన్స్ సమావేశంలో శిక్షణ ఇస్తామన్నారు. సెల్‌ఫోన్లు కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతించమన్నారు. ఏజెంట్లకు ఐడీ కార్డులు జారీ చేసేందుకు ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. మీడియా సెంటర్లో ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేయాలని గ్రౌండ్ వాటర్ అధికారి ఎన్నికల నోడల్ అధికారి సురేశ్‌ను ఆదేశించారు. పోలీస్ అధికారుల సూచనల మేరకు వాహనాలను డిగ్రీ కళాశాలలో పార్కింగ్ చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారుల వాహనాలను మాత్రమే కౌంటింగ్ కేంద్రం ఆవరణలోకి అనుమతిస్తామని చెప్పారు.

# అభివృద్ధిని చూసి ఓట్లు వేశారు..

- గెలిచేది బీఆర్ఎస్ పార్టీయే..
- కాంగ్రెస్ పార్టీ పేదలకు ఏమీ చేయలె..
- ఎడ్యుకేషన్ హబ్‌గా మానుకోట
- బీఆర్ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్



క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న నూకల నరేశ్‌రెడ్డి, చిత్రంలో బానోత్ శంకర్‌నాయక్

మహబూబాబాద్/మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 1 : తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసే ప్రజలు తమ విలువైన ఓట్లను బీఆర్ఎస్‌కు వేశారని బీఆర్ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ఎమ్మెల్యే క్యాం పు కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్‌నాయక్ మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో నోటిఫికేషన్ విడుదల చేసినప్పటి నుంచి బీఆర్ఎస్ పార్టీకి అండదండలు అందించిన ప్రజలు, నా యకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని, ప్రజలకు మరిన్ని అభివృద్ధి పనులు చేయడంతోపాటు, సంక్షేమ పథకాలను నిర్విరామంగా కొనసాగిస్తామన్నారు. పార్టీకి వెన్నంటే ఉండి కృషి చేసిన బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు రుణపడి ఉంటానని చెప్పారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో నంబర్‌వన్‌గా నిలిపారని అన్నారు. ఆంధ్రా పాలకులతో కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకొచ్చారని, ప్రతి ఒక్కరికీ లబ్ధి జరిగేలా సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. గతంలో 30 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ పేదలు, రైతులకు ఏమి చేసిందో చెప్పాలన్నారు. నీళ్లు, కరెంట్ లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. వ్యవసాయం దండుగ అనే స్థితి నుంచి వ్యవసాయం పండుగ అనే స్థాయికి సీఎం కేసీఆర్ తీసుకొచ్చారని, రైతులను అన్ని విధాలా ఆదుకున్నారని అన్నారు. ప్రస్తుతం ఏ రంగంలో చూసినా అభివృద్ధి కండ్ల కు కట్టే విధంగా కనిపిస్తున్నదన్నారు. రాష్ట్రంలో ప్రజలు గులాబీ పార్టీకే ఎక్కువ మద్దతు ఇచ్చి ఓట్లు వేశారని, ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారన్నారు. మానుకోటను ఎంతో అభివృద్ధి చేశారని, మరింత అభివృద్ధి చేసేందుకు ఓటర్లు గులాబీ పార్టీకే పట్టం కట్టబోతున్నారని, ఎక్కువ శాతం ఓట్లు బీఆర్ఎస్‌కే పడ్డాయన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలను ఎవరూ నమ్మొద్దన్నారు. పట్టణంలో మెడికల్ కళాశాల, ఇంజినీరింగ్, ఎస్పీ కార్యాలయం నిర్మాణ పనులు సగంలోనే ఉన్నాయని, ఈ సారి బీఆర్ఎస్ గెలిచాక పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రజలు ఇచ్చే తీర్పుకు కట్టుబడి ఉంటామని, కేసీఆర్ నాయకత్వంలో మరింత అభివృద్ధి చేస్తాన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, పట్టణ అధ్యక్షుడు గద్దె రవి, మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ సుధగానిమురళి, సత్యనారాయణ పాల్గొన్నారు.



మంగళ సూత్రాన్ని చూపిస్తున్న పూజారి

# కన్నుల పండువగా రాములోరి కల్యాణం

**తరలివచ్చిన భక్తులు, భక్తిశ్రద్ధలతో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు**

లింగాలఘనపురం, డిసెంబర్ 1 : మండలంలోని జీడికల్ రాములోరి కల్యాణం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. తిరు కల్యాణాన్ని తిలకించేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా నల్లగొండ, హైదరాబాద్, కరీంనగర్ తదితర జిల్లాల నుంచి భక్తులు తరలి వచ్చారు. స్వామి వారి కల్యాణాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని రామ, లక్ష్మణ, హనుమ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీ పైకి చేర్చారు. మరో పల్లకీలో సీతమ్మ విగ్రహాన్ని చేర్చి, మేళతాళాలతో ఆలయం నుంచి ఆలయం బయట నిర్మించిన కల్యాణ మండపం పైకి చేర్చారు. పూజా సామగ్రిని దేవాదాయశాఖ ఆర్‌జేసీ రాంకృష్ణారెడ్డి, నల్లగొండ ఏసీ మహేంద్రకుమార్, జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, ఎంపీపీ జయశ్రీపేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కొండబోయిన కిరణ్‌కుమార్, ఈవో శేషుభారతి, మాజీ చైర్మన్ సానికె మధు పూజా సామగ్రిని వేదికపైకి చేర్చారు. పుర్వసు నక్షత్రయుక్త కర్కాటక లగ్నంలో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా జరిపారు. దేవాదాయ శాఖ ద్వారా పట్టు వస్త్రాలు, తలంబ్రాలను ఆ శాఖ ఆర్‌జేసీ రాంకృష్ణారావు, ఏసీ మహేంద్రకుమార్ స్వామివారికి సమర్పించారు. యాగ్నికులు గట్టు శ్రీనివాసాచార్యులు, విజయసారథి, పూజారులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు, రాఘవాచార్యులు, ఆచార్య వర్చిశ్, బుచ్చయ్య శర్మ కల్యాణాన్ని జరిపించారు. కార్యక్రమాల్లో నాయకులు బొల్లంపెల్లి నాగేందర్, బోయిని రాజు, కత్తుల శ్రీపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, కూకట్ల మల్లయ్య చౌదరపెల్లి శేఖర్, ఉప్పల మధు, చౌదరపెల్లి పూర్ణచందర్, సిబ్బంది కేకే రాములు, రాజేందర్‌రెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డి, మధు, భరత్‌కుమార్, మల్లేశం పాల్గొన్నారు. ఎంపీపీ జయశ్రీ స్వామి వారికి, అర్చకులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈవో శేషుభారతి, సిబ్బంది పాల్గొన్నారు.



పూజా సామగ్రిని తీసుకొస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ దంపతులు



కుంకుమేశ్వరాలయంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

# వైభవంగా కార్తీక మాస పూజలు

పరకాల, డిసెంబర్ 1: పట్టణంలోని శ్రీ భవానీ కుంకుమేశ్వర ఆలయంలో కార్తీక మాస పూజలు వైభవంగా జరిగాయి. శుక్రవారం శైవాగమ పండితుడు కోమాళ్లపల్లి సంతప్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో కార్తీక మాసోత్సవ పూర్వక వజ్రగధిత పాశుపత మహా రుద్రయాగ సహిత ఆకాశ దీపోత్సవ మహాఅన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, అర్చకులు కోమాళ్లపల్లి నాగభూషణశర్మ, ఈవో వెంకటయ్య పాల్గొన్నారు.